క్లుప్తంగా

ఉత్తమ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ కల్చరల్: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని సాంస్కృతిక సేవాసంస్థ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు ప్రదానం చేయనున్నట్టు సంస్థ కన్వీనర్ జి.విజయ్ కుమార్ తెలిపారు. విద్యా రంగంలో విశేష కృషి చేసిన బోధన రంగంలో అన్ని కేటగిరిలకు చెందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చునని ఆయన తెలిపారు. ఆసక్తిగల వారు ఈ నెల 31వ తేదీ లోపు 93913 79903 మొబైల్ వాట్సప్‌కు వివరాలు అందజేయాలని కోరారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

కాకినాడ: నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు ఆదేశించారు. శుక్రవారం ఆయన పలు ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. జగన్నాథపురంతో పాటు రామకృష్ణారావుపేట ప్రాంతంలో జరిగిన రహదారి విస్తరణ, పర్లోపేటలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం, స్వర్ణాంధ్ర కాలనీలో రహదారి నిర్మాణం, సెవెన్ హిల్స్ ప్రాంతంలోని ఇతర అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఏఈలు వై.నాగేశ్వరరావు, నాగ సతీష్ ఉన్నారు.

బీరు సీసాతో దాడి

కాకినాడ క్రైం: కాకినాడలోని దుమ్ములపేటలో మద్యం మత్తులో ఇద్దరి మధ్య చోటు చేసుకున్న ఓ గొడవ పరస్పర దాడికి దారి తీసింది. దుర్గమ్మ గుడి సమీపంలో దూడ మత్తయ్య అనే వ్యక్తి కూర్చొని ఉండగా గరికిన సింహాద్రి అనే వ్యక్తి వచ్చి బీరు సీసా దించకుండా తాగే పోటీ పెట్టుకుందామంటూ ఒత్తిడి చేశాడు. అందుకు మత్తయ్య అంగీకరించలేదు. దీంతో ఇరువురి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో సింహాద్రి మత్తయ్య తలపై బీరు సీసాతో కొట్టాడు. గాయాల పాలైన మత్తయ్యను స్థానికులు కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అతడి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై గురువారం రాత్రి కాకినాడ పోర్టు పోలీసులు కేసు నమోదు చేశారు.

రైల్వే బంటా నీళ్లలో చేపలకు వేలం

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ పరిధిలో ఉన్న బంటా నీళ్లలో (చెరువులో చేపలు పట్టుకుని పోవడానికి 25వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు సీనియర్ సెక్షన్ కార్యాలయం వద్ద బహిరంగ వేలం జరుగుతుందని సీనియర్ సెక్షన్ ఇంజినీర్ రామసుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సామర్లకోట అసిస్టెంట్ డివిజినల్ ఇంజినీర్ సమక్షంలో 2023–28 వరకు ఐదేళ్లకు నిబంధనలతో కూడిన పాట జరుగుతుందన్నారు. పాటదారులు 18 శాతం ఈఎస్టీటీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ద్వారపూడి యార్డు వద్ద 7,560 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న బంటాకు రూ.1,02,630గా నిర్ణయించినట్టు తెలిపారు. అలాగే ద్వారపూడి హామాలీస్ విశ్రాంతి గది వద్ద 1,496 చదరపు మీటర్ల విస్తర్ణంలోని బంటాకు రూ.21,120గాను, ద్వారపూడి పై లైనులో 960 చదరపు మీటర్ల విస్తీర్ణంలో బంటాకు రూ.13,420గాను, 9000 చదరపు మీటర్ల విస్తీర్ణంలోని బంటాకు రూ.1,22,430గాను ద్వారపూడి కింది లైను 5000 చదరపు మీటర్ల విస్తీర్ణంలోని బంటాకు రూ.67,980గాను, బలభద్రపురం స్టేషన్ కింది లైన్ 1,440 చదరపు మీటర్ల బంటాకు రూ.19,690గా నిర్ణయించినట్టు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఆయా బంటాలను నిర్ణయించిన రేటు నుంచి పాటలో పాల్గొన్నాలన్నారు.

కోవిడ్ వ్యాక్సిన్ ట్రయల్స్‌లో ప్రత్తిపాడు వాసి



వెంకటేష్‌ను సత్కరిస్తున్న కేసీఆర్

ప్రత్తిపాడు: కోవిడ్ వ్యాక్సిన్ ట్రయల్స్ పాల్గొన్న ప్రత్తిపాడు గ్రామానికి చెందిన ముక్కు వెంకటేషను ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ సత్కరించారు. ప్రత్తిపాడు గ్రామానికి చెందిన విశ్రాంత ఎంఈఓ ముక్కు సుబ్రహ్మణ్యం కుమారుడు వెంకటేష్ నాగ్‌పూర్‌లో జియో కంపెనీలో మేనేజర్‌గా పని చేస్తున్నాడు. కోవిడ్ సమయంలో వ్యాక్సిన్ కనిపెట్టడానికి భారత్ బయోటెక్ ఆధ్వర్యంలో గిల్లూర్కర్ ఆసుపత్రిలో డాక్టర్ చంద్రశేఖర్ నిర్వహించిన క్లినికల్ ట్రయల్స్‌లో నాగ్‌పూర్‌కు చెందిన 50 మంది యువకులు పాల్గొన్నారు. వారిలో ముక్కు వెంకటేష్ ఒకరు. కోవిడ్ వ్యాక్సిన్ విజయవంతమైన సంగతి తెలిసిందే. కాగా ఇటీవల నాగపూర్ వచ్చిన సీఎం కేసీఆర్‌ను ఉభయ తెలుగు రాష్ట్రాల యువకులు కలిశారు. వారి ద్వారా క్లినికల్ ట్రయల్స్‌లో పాల్గొన్న ముక్కు వెంకటేష్ ధైర్యాన్ని సీఎం కేసీఆర్ ప్రశంసించి సత్కరించారు.

పనుల్లో ప్రమాణాలు పాటించాలి

పెద్దాపురం: గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు మరింత నాణ్యతతో నిర్మించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు అన్నారు. మండలంలోని వడ్లమూరు గ్రామంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను గురరువారం ఆయన పరిశీలించారు.

శ్రావణం.. శుభప్రదం

- భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి, మంగళగౌరీ వ్రతాలు
- జిల్లాలోని 110 ఆలయాల్లో ఏర్పాట్లు
- ఉచితంగా పూజా సామగ్రి పంపిణీ



కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న పెద్దమార్కెట్

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ప్రతి ఇల్లూ దేవాలయాన్ని తలపించే మాసం శ్రావణం. ప్రతి సువాసినీ శుక్రవార నోములు ఆచరిస్తూ దేవతా స్వరూపాలై నట్టింట నడయాడే వరలక్ష్మిలా దర్శనమిచ్చే పవిత్ర మాసం ఇది. ఈ మాసంలో చేపట్టే ఎలాంటి కార్యానికైనా అమ్మవారి దయ కచ్చితంగా ఉంటుందని పండితులు చెబుతున్నారు. పౌర్ణమినాడు చంద్రుడు శ్రవణం నక్షత్రంలో సంచరించడం వల్ల ఈ మాసానికి ఆ పేరు వచ్చిందని వారంటారు. స్థితికారుడైన మహావిష్ణువు భార్య శ్రీసతికి అత్యంత ప్రీతికరమైన మాసం ఇదని పురాణ వచనం. దీనికి తోడు మహావిష్ణువు జన్మ నక్షత్రం శ్రవణం కావడం మరో విశేషం. ఈ నెలలో చేసే దైవ కార్యలకు ఎంతో శక్తి ఉంటుందని పెద్దలు అంటారు. ఈ నెలలో జరుపుకొనే రాఖీ పౌర్ణమి సోదరీ సోదరుల బంధానికి ప్రతీక. కృష్ణ పాడ్యమి, హయగ్రీవ జయంతి, కృష్ణ విదియ, రాఘవేంద్ర ఆరాధన వంటి ముఖ్యమైన రోజులు వచ్చేది ఈ మాసంలోనే. కృష్ణాష్టమి, పొలాల అమావాస్య, గోపూజలను సైతం ఈ నెలలోనే చేస్తారు. ఈ నెలల్లో నాలుగు శుక్రవారాలు ఆలయాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించేందుకు దేవదాయశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది.

శివారాధనకు ఎంతో విశిష్టత

దక్షిణాయనంలో వచ్చే విశిష్టమైన మాసాల్లో శ్రావణమాసం శివపూజకు విశిష్టమైనది. ముఖ్యంగా భగవదారాధనలో శివ, కేశవ భేదం లేకుండా పూజించడానికి విశేషమైనది. ఈ నెలలో చేసే ఏ చిన్న దైవ కార్యానికైనా కొన్ని వేల రెట్లు శుభ ఫలితాన్నిస్తుందని, ప్రతి సోమవారం పగలంతా ఉపవాసం ఉండి రాత్రి వేళల్లో స్వామి వారికి రుద్రాభిషేకాలు, బిల్వార్చన చేస్తే పాపాలు కడతేరుతాయని శాస్త్రాల్లో సూచించారు.

మంగళ గౌరీ వ్రతం

శ్రావణమాసంలో అన్ని మంగళవారాల్లో చేసే వ్రతమే మంగళగౌరీ వ్రతం. ఈ వ్రతాన్ని నారదుడు సావిత్రికి, శ్రీకృష్ణుడు ద్రౌపతికి తెలిపినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఈ వ్రతాన్ని కొత్తగా పెళ్లయిన వారు ఆచరించాలి. వివాహమైన తరువాత వచ్చే మొదటి శ్రావణమాసంలో ఈ వ్రతాన్ని చేయడం ఆనవాయితీ. శ్రావణమాసంలో వచ్చే అన్ని మంగళవారాలు ఈ వ్రతం క్రమం తప్పకుండా చేయాలి.

పౌర్ణమి ముందు శుక్రవారానికే..

శ్రావణమాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారమే ఈ వ్రతం చేయాలి. ఒకవేళ అప్పుడు వీలు కాకుంటే శ్రావణమాసంలో మరొక శుక్రవారమైనా ఈ వ్రతం ఆచరించవచ్చు.

ఆలయాల్లో ఉచిత వరలక్ష్మీ వ్రతాలు

శ్రావణ శుక్రవారం సందర్భంగా జిల్లాలోని 110 ఆలయాల్లో ఉచితంగా శ్రావణ శుక్రవారం పూజలు నిర్వహించేందుకు దేవదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పది కాలాలు సుఖశాంతులు..



శ్రావణమాసం, హిందువులకు అత్యంత శుభప్రదమైన మాసం. ఈ మాసంలో ఆలయాల్లో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తే తమ కుటుంబాలు పది కాలాలు సుఖశాంతులతో ఉంటాయి. మంగళగౌరీ వ్రతం, వరలక్ష్మి వ్రతం ఆచరిస్తున్నారు. ఈ వ్రతాల వల్ల లక్ష్మీ కటాక్షం, సౌభాగ్యం లభిస్తుంది.

– చెరుకూరి సుబ్రహ్మణ్యం, ప్రధానార్చకుడు, బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానం

ఉచితంగా వ్రతాలు



శ్రావణ శుక్రవారం సందర్భంగా నాలుగు వారాలు జిల్లాలోని అన్ని అమ్మవారి ఆలయాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఉచితంగా నిర్వహించాలని ఇప్పటికే ఆయా ఆలయాల ఈఓలకు ఆదేశాలు జారీ చేశాం. మహిళలకు పూజా సామగ్రి, ప్రసాదం ఉచితంగా అందించేందుకు ఏర్పాట్లు చేశాం.

– పులి నారాయణమూర్తి, జిల్లా దేవదాయశాఖాధికారి

మార్కెట్లకు శ్రావణ శోభ



కరపలోని దుర్గాదేవి అమ్మవారు

వరలక్ష్మి వ్రతానికి కావాల్సిన పువ్వులు, పత్రి, బంగారు రూపు, లేదా ఆభరణాల వంటివి వాటిని కొనుగోలు చేసేందుకు వచ్చిన మహిళలతో గురువారం మార్కెట్లు శోభాయమానంగా తయారయ్యాయి. భానుగుడి, నాగమల్లి తోటజంక్షన్, అశోక్‌నగర్, గాంధీనగర్, రామారావుపేట, బాలాజీచెరువుసెంటర్, పెద్దమార్కెట్‌లో బిజీబిజీగా మారాయి. రోడ్డుపక్కన పత్రి, పండ్ల దుకాణాలు వెలియడంతో వాహనచోదకులు అవస్థలు పడాల్సి వచ్చింది. భానుగుడి, బాలాజీచెరువు, పెద్దమార్కెట్‌లో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.

పూజా సామగ్రి ధరలకు రెక్కలు

గత సంవత్సరం కిలో చామంతి పూలు రూ.300 కాగా ప్రస్తుతం రూ.500కి చేరాయి. అరటి, బత్తాయి, మొక్కజొన్న వంటి గత సంవత్సరంతో పోల్చుకుంటే సగానికి పైగా రేట్లు పెరిగాయి. మొక్కజొన్నపొత్తు గత సంవత్సరం రూ.5 ఉంటే ప్రస్తుతం 15కి చేరింది. అరటి పళ్ల డజను గత ఏడాది రూ.40 ఉంటే ఈ ఏడాది రూ.60కి పైగా విక్రయిస్తున్నారు. బత్తాయి డజను గత సంవత్సరం 100 ఉంటే ఈ సంవత్సరం 200కి చేరింది. దానిమ్మ పండు ఒక్కటి రూ. 40కి విక్రయించారు. జామకాయ కూడా ఒక్కొక్కటి రూ. 15 విక్రయించారు.

బంగారు చీరలో బాలాత్రిపుర సుందరి అమ్మవారు

శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని స్థానిక సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారు బంగారం చీరలో భక్తులకు దర్శనమిస్తారని ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.



చామంతి పువ్వులు కొనుగోలు చేస్తున్న మహిళలు

కరప మండలంలో..

కరప: మండలంలో కరప, వేళంగి, నడకుదురు, పెనుగుదురు, గొర్రిపూడి, అరట్లకట్ట తదితర గ్రామాల్లో వరలక్ష్మీ వ్రతాల సామగ్రికి సంబంధించిన దుకాణాలు వెలిశాయి. కొబ్బరి, బత్తాయి, యాపిల్, దానిమ్మ, అరటిపండ్ల ధరలు గతేడాది కంటే పెరిగాయని వినియోగదారులు అంటున్నారు. పూలరేట్లయితే కొండెక్కాయి.



ఒక దుకాణంలో బంగారు ఆభరణాలు కొనుగోలు చేస్తున్న మహిళలు

గులాబీ, చామంతి. కనకాంబరాల రేట్లు కూడా అదే రీతిలో ఉన్నాయి. లక్ష్మీదేవి రూపు కూడా గతేడాదితో పోలిస్తే రూ.800 నుంచి రూ. 1.100 వరకు పెరిగిందంటున్నారు. రేట్లు పెరగడంతో వినియోగదారులను ఆకర్షించేందుకు బంగారు దుకాణాల్లో ఒకరూపు కొంటే ఒకచీర ఉచితం ఆఫర్ పెట్టడంతో మహిళలు లక్ష్మీదేవి రూపులు కొనేందుకు ఎగబడ్డారు. రేట్లు పెరిగినా వరలక్ష్మీదేవి వ్రతం కోసం కొనక తప్పదని మహిళలు తెలిపారు. మండల పరిధిలో దుర్గాదేవి ఆలయాలను ముస్తాబుచేసి, భక్తుల దర్శనం కోసం ఆయా అలయ కమిటీలు ఏర్పాట్లు చేశారు.

టిడ్కో రుణ ప్రక్రియ పూర్తి చేయండి

సిబ్బందికి కమిషనర్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: టిడ్కో గృహాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బ్యాంకు లింకేజీని నూరుశాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు ఆదేశించారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం సాయంత్రం టిడ్కో ఇళ్లకు సంబంధించి రుణ ప్రక్రియ, పెండింగ్ పనులపై మెప్మా అధికారులు, సీవోలతో సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తొలి విడత 1152 టిడ్కో ఇళ్లను త్వరలోనే అప్పగించనున్నామన్నారు. ఇందుకు సంబంధించి 989 మంది లబ్దిదారులకు రూ.2.73 లక్షల చొప్పున బ్యాంకు లింకేజీ మాత్రమే వచ్చిందని మిగిలిన 25 శాతం సొమ్మును వచ్చే బుధవారం లోగా నూరుశాతం అందేలా కృషి చేయాలన్నారు. రూ.8 కోట్లు వరకు బ్యాంకు లింకేజీ మంజూరు కావాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియతో సమాంతరంగా మార్ట్‌గేజ్ కూడా పూర్తయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో మెప్మా సిటీ మిషన్ మేనేజర్ డేగల వెంకటరాజు, సీవోలు సమావేశంలో పాల్గొన్నారు.

ఆటో ఢీకొని వృద్ధుడి మృతి

కాకినాడ రూరల్: కాకినాడ – పిఠాపురం రోడ్డులో మండలం పరిధిలోని పి.వెంకటాపురం వద్ద బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఆటో ఢీకొని అదే గ్రామానికి చెందిన వృద్ధుడు పిల్లి సత్యనారాయణ (57)మృతి చెండాడు. తిమ్మాపురం పోలీసులు తెలిపిన వివరాల మేరకు సత్యనారాయణ సిమెంట్ షాపులో కూలి పని ముగించుకుని రోడ్డు దాటి కిళ్లీ దుకాణం వద్దకు వెళుతుండగా కాకినాడ నుంచి పిఠాపురం వైపు వెళుతున్న ఆటో ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయనను ఆదే ఆటోలో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా మార్గంలో మృతి చెందాడు. మృడుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కొడుకులు హైదరాబాద్‌లో ఉంటుండగా సత్యనారాయణ భార్యతో కలిసి పి.వెంకటాపురంలో ఉంటున్నారు. భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై నాగార్జున రాజు గురువారం కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృత దేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు ఎస్సై తెలిపారు.

ఇస్రోను స్ఫూర్తిగా తీసుకోవాలి



అధ్యాపకులు, సిబ్బందితో మాట్లాడుతున్న నన్నయ వీసీ పద్మరాజు

చంద్రయాన్–3 విజయంపై నన్నయ వీసీ పద్మరాజు

కాకినాడ రూరల్: గత వైఫల్యాలను సరిదిద్దుకుంటూ విజయాల బాట పడుతున్న ఇస్రోను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని నన్నయ్య యూనివర్సిటీ వీసీ ప్రొఫెసరు కె.పద్మరాజు పేర్కొన్నారు. అచ్చంపేట జంక్షన్ వద్ద వర్సటీ ఎంఎస్ఎన్ పీజీ సెంటరును గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పీజీ సెంటరులో అంతర్గత రోడ్ల నిర్మాణం, కొత్త కోర్సులు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రిన్సిపాల్ డాక్టర్ కమలకుమారి, సిబ్బందితో సమీక్షించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ చంద్రయాన్ – 3 విజయంతో ప్రపంచంలో చంద్రుడి దక్షిణ ధ్రువంపై ముందుగా ఉపగ్రహాన్ని పంపిన ఘనతను మన శాస్త్రవేత్తలు సాధించారన్నారు. ఎంఎస్ఎన్ క్యాంపస్‌పై కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మనోజ్‌దేవా నిర్మించిన ప్రమోషనల్ వీడియోను పద్మరాజు ఆవిష్కరించారు. ప్రొఫెసర్ ప్రశాంతి, డాక్టరు ఎం.పోచయ్య, డాక్టర్ అజయ్ రతన్, డాక్టర్ విజయశ్రీ, డాక్టర్ స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులు ఓటరుగా నమోదు కావాలి

ఆర్డీవో సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో సత్యనారాయణ

కరప: అర్హులందరూ ఓటరుగా నమోదు కావాలని కాకినాడ డివిజన్ ఆర్డీవో ఎస్‌వీవీ సత్యనారాయణ సూచించారు. కరపలో గురువారం బూత్ లెవిల్ ఆఫీసర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితా పరిశీలన ముగిసిన నేపథ్యంలో ఓటర్ల చేర్పులు, మార్పులు తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు. డబుల్ ఎంట్రీలు, మృతులను జాబితా నుంచి తొలగించాలన్నారు. ఫారమ్–7, 8లపై అవగాహన కల్పించి పారదర్శక ఓటర్ల జాబితాను రూపొందించాలన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు తమ ఓటు హక్కు పొందాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. క్షేత్రస్థాయిలో వచ్చే ఫిర్యాదులను విచారించాలని, అనర్హులను జాబితాను నుంచి తొలగించాలని సూచించారు. తహసీల్దార్ పొన్నమండ శ్రీనివాసరావు, డీటీకే అనిల్‌కుమార్. ఎంఎస్ఓ తాతపూడి శ్రీనివాస్, ఆర్ఎస్ఐ పేపకాయల మాచరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపూరులో పట్టపగలే చోరీ

- వరలక్ష్మీ వ్రతం పూజా సామగ్రికి దంపతులు వెళ్లిన సమయంలో దోపిడీ
- సొత్తు విలువ రూ.1.5 లక్షలు

కాకినాడ రూరల్: వరలక్ష్మి వ్రతం పూజా సామగ్రికి బయటకు వెళ్లిన ఆ దంపతులు తిరిగి ఇంటికి వచ్చే సరిగా ఆ ఇల్లు గుల్ల అయ్యింది. పట్టపగలే దొంగలు బరి తెగించారు. ఇంట్లోని బంగారు ఆభరణాలను దోచుకుపోయారు. వివరాలులోకి వెళితే మండలంలోని రేపూరు గ్రామంలో గురువారం పట్టపగలే చోరీ జరిగింది. ఇంద్రపాలెం పోలీసుల వివరాల ప్రకారం మోర్తండ వెంకట దుర్గా ప్రసాద్ దంపతులు కాకినాడలో పూజ సామగ్రి కొనుగోలుకు ఉదయం 11 గంటలకు వెళ్లారు. తిరిగి ఒంటి గంటకు వచ్చే సరికి తలుపులు తెరిచి ఉన్నట్టు గమనించారు. లోపలికి వెళ్లి చూసే సరికి హారం, నక్లెస్, రూపు వంటి బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో ఇంద్రపాలెం పోలీసులకు వెంకట దుర్గా ప్రసాద్ ఫిర్యాదు చేయడంతో ఎస్సై దేవ సుధ కేసు నమోదు చేశారు. క్లూస్ టీమ్ వివరాలు సేకరించారు. తలుపులు బద్దలు కొట్టి చోరికి పాల్పారని, 75 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ అయ్యాయని, సొత్తు విలువ రూ.1.5 లక్షల వరకు ఉంటుందన్నారు. కేసు దర్యాపు చేస్తున్నట్టు ఆమె తెలిపారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్
- 11 జిల్లాల డ్వామా పీఓలకు శిక్షణ



డ్వామా అధికారులకు శిక్షణ ప్రారంభించిన వైస్ ప్రిన్సిపాల్

సామర్లకోట: ఉపాధి హామీ పథకంలో పనులు మరింత నాణ్యతతో జరగడానికి ఇస్తున్న శిక్షణను డ్వామా అధికారులు సద్వినియోగం చేసుకోవాలని ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ ఇ.కృష్ణమోహన్ అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, తూర్పుగోదావరి, పశ్చిమ, ఏలూరు, కాకినాడ, కోనసీమ, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాలో పని చేస్తున్న డ్వామా పీఓలకు మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణను గురువారం ఆయన ప్రారంభించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి గ్రామంలోను మొక్కలు నాటడంపై దృష్టి సారించాలన్నారు. ఈ మొక్కలలో 60 శాతం మునగ మొక్కలు ఉండేలా చూడాలన్నారు. ఈటీసీ ప్యాకల్టీలు పి.శ్రీనివాసరావు, ఎంఎస్ఎన్ రెడ్డి, బి.ఆంజనేయులు, వెంకటేశ్వరరావు, వి.ప్రసాద్, నిహారిక, ఎస్కె మొహిద్దీన్‌లు మొదటి రోజు శిక్షణ నిర్వహించారు.

ఘనంగా లక్ష్మీదేవి విగ్రహ ప్రతిష్ఠ



రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

పెద్దాపురం: పట్టణంలో నాయీ బ్రాహ్మణ కాలనీలో నూతనంగా నిర్మించిన సీతారామ గణపతి సాయి ఆలయం రామాలయంలో గురువారం లక్ష్మీదేవి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు విడదాసరి రాజా, తమిరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కౌన్సిలర్లు ఆరెళ్లి వీర్రాఘవులు, కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ తదితరులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నదానాన్ని వారు ప్రారంభించగా వేల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తేలు కుట్టి విద్యార్థి మృతి

- ఫలించని సత్వర వైద్యం
- శరీరమంతా విషం వ్యాపించి క్షీణించిన అవయవ చైతన్యం
- తల్లిదండ్రుల రోదనలతో మిన్నంటిన జీజీహెచ్ ఆవరణ

కాకినాడ క్రైం: ఉన్నత చదువులు చదివి జీవితం బంగారుమయం చేసుకోవలసిన ఓ విద్యార్థి తేలు కుట్టడంతో ప్రాణాలు కోల్పోయాడు. కపిలేశ్వపురం మండలం కోరుమిల్లి గ్రామానికి చెందిన యాళ్ల అభిలాష్ (14) వాకతిప్ప జెడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. ఎప్పటిలాగే, గురువారం ఉదయం పాఠశాలకు వచ్చాడు. ఉదయం 10 గంటల సమయంలో తరగతి గదిలో చివర ఉన్న విరిగిపోయిన బెంచీల మూలల్లో వ్యర్థాలను శుభ్రం చేసేందుకు తన స్నేహితుడితో కలిసి వెళ్లాడు. అలా శుభ్రం చేస్తుండగా ఓ తేలు అభిలాష్ చేతిపై కుట్టింది. అది గమనించిన మరో విద్యార్థి తేలుని కొట్టి చంపాడు. ఆ తక్షణమే తరగతి ఉపాధ్యాయుడు మరో ఉపాధ్యాయుడు రాజ్‌కుమార్‌కు చెప్పి అభిలాష్‌ను స్థానిక పీహెచ్‌సీకి పంపారు. అక్కడి వైద్యుడు మందులు ఇచ్చారు. కాసేపటికి విద్యార్థికి వాంతులయ్యాయి. మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు సిఫార్సు చేయగా అభిలాష్‌ను రాజ్‌కుమార్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే నాడి కొట్టుకోవడంలో ప్రతికూల మార్పులు వచ్చాయని వైద్యులు గుర్తించారు. వైద్యం మొదలైన కొద్ది సేపటికి మూడు రక్తపు వాంతులయ్యాయి. అత్యవసర స్థితి ఎదురుకావడంతో ఐసీయూలో ఉంచి వైద్య సేవలు అందించారు. విద్యార్థి పరిస్థితి తెలుసుకున్న ఎంఎల్‌సీ తోట త్రిమూర్తులు విద్యార్థి ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తం చేస్తూ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవిని ఫోన్‌లో సంప్రదించి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. అభిలాష్‌కు వైద్యం కొనసాగుతుండగా అప్పటికే తేలు విషం శరీరం మొత్తానికి అంచెలంచెలుగా వ్యాపించి కీలక అవయవాల పనితీరుని పూర్తిగా దెబ్బతీసింది. సమయం గడుస్తున్న కొద్ది అవయవాలన్నీ ఒకొక్కటిగా క్షీణించడం మొదలు పెట్టాయి. ఈ స్థితిలో మృత్యువుతో పోరాడిన అభిలాష్ గురువారం రాత్రి ప్రాణాలు కోల్పోయాడు. అభిలాష్ తండ్రి ప్రసాద్ ఓ దినసరి కూలి. ఈయనకు ఇద్దరు కుమారులు ఉండగా అభిలాష్ చిన్నవాడు. కుమారుడి మరణంతో తల్లిదండ్రులు జీజీహెచ్ ఆవరణలో గుండెలవిసేలా రోదించారు. పదుల సంఖ్యలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కాకినాడ జీజీహెచ్‌కు చేరుకున్నారు.

ఆక్రమణల తొలగింపు



డ్రైన్లపై ఆక్రమణలను తొలగిస్తున్న జేసీబీ

కరప: కరప ప్రధాన రహదారిపై డ్రైన్లను ఆక్రమించి ఏర్పాటు చేసిన పలు దుకాణాలను గురువారం పంచాయతీ అధికారులు జేసీబీతో తొలగించారు. వ్యాపారులు డ్రైన్లను ఆక్రమించి వాటిపై షాపులను ఏర్పాటు చేయడంతో తీవ్ర ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. అలాగే డ్రైన్లు పూడుకుపోయి మురుగు పారక దోమలు ఉధృతంగా పెరిగిపోతున్నాయి. వర్షాలు పడుతున్న సమయంలో డ్రైన్లలో మురుగంతా రోడ్లపై నిలిచి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దీనిపై స్పందనలో అధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి ఎస్కే నాగేంద్రకుమార్, జేఏ కె.కేశ్వరావు, సర్పంచ్, సాదే ఆశాజ్యోతి ఆధ్వర్యంలో డ్రైన్‌లపై ఆక్రమణలను తొలగించారు. పూడికలు తీయడానికి వీలుగా డ్రైన్లపై ఉన్న బల్లలను తొలగించారు.

బ్రేకులు ఫెయిలై ఆటో బోల్తా

- నలుగురి పరిస్థితి విషమం, కేజీహెచ్‌కు తరలింపు
- మరో ఆరుగురికి స్వల్ప గాయాలు
- క్షతగాత్రులంతా కాకినాడ జిల్లా వాసులు
- సాగుల ఘాట్ రోడ్డులో ప్రమాదం

గూడెంకొత్తవీధి: అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం సాగుల ఘాట్ రోడ్డులో గురువారం ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో కాకినాడ జిల్లాకు చెందిన నలుగురికి తీవ్రంగానూ, మరో ఆరుగురికి స్వల్పంగానూ గాయాలయ్యాయి. కాకినాడ జిల్లా దుమ్ములపేటకు చెందిన 20 మంది క్రైస్తవ మత ప్రచారకులు మత ప్రచారానికి గూడెం కొత్తవీధి మండలం చీడిగొంది, లక్కవరం గ్రామాలకు రెండు ఆటోల్లో బయలు దేరారు. ఈ క్రమంలో సాగుల ఘాట్ రోడ్డులో పది మంది ప్రయాణికులతో వస్తున్న ఆటో బ్రేకులు ఫెయిలై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సర్జన్‌కుమార్ (50), తాతారావు (30), ఇజ్రాయిల్ (35), జోసఫ్ (30)లకు తీవ్ర గాయాలయ్యాయి. వారి పరిస్థితి విషమంగా ఉండటంతో వెంటనే 108 వాహనంలో గూడెం ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు వినయ్‌కుమార్, అచ్యుత్ వెంటనే ప్రాథమిక వైద్యం అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వారిని కేజీహెచ్‌కు తరలించారు. మరో ఆరుగురు నూకరాజు, ఆనందరావు, శ్రీనివాస్, క్రాంతి, రమేష్, సాయిలకు గాయాలైనా వారి పరిస్థితి నిలకడగా ఉంది. వారికి స్థానిక ఆస్పత్రిలోనే వైద్య సేవలందించారు.